మాట్లాడుతున్న తిరుణహరి శేషు

రెండు ఎమ్మెల్సీ స్థానాలు బీసీలకు కేటాయించాలి

హనుమకొండ, ఫిబ్రవరి 27 : ఎమ్మెల్యేల కోటాలోని ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలు బీసీలకు కేటాయించాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు లేఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సుబేదారిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాసనసభ, రాజ్యసభ, లోక్ సభలో ప్రాతినిధ్యం లేని ఎంబీసీ, సంచార జాతులకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు తప్పకుండా కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు దారబోయిన సతీశ్, ఎర్రబొజ్జు రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ధైర్యంగా ఉండాలి

- ఆత్మహత్యలు సరికాదు
- వ్యవసాయ కళాశాల డీన్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్ ఫిబ్రవరి 27 : విద్యార్థులు ధైర్యంగా ఉండి చదువు కొనసాగించాలని వరంగల్ వ్యవసాయ కళాశాల డీన్ వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న రష్మిక ఉరేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్మిక సంతాప సభ గురువారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. ఏ విషయంలోనూ విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఓటింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య
- జిల్లాలో 91.68 శాతం ఓటింగ్

హనుమకొండ : ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, ఫిబ్రవరి 27 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 15 పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. జిల్లాలో 5,215 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 4,780 మంది తమ ఓటు హక్కు (91.68శాతం) వినియోగించుకున్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీ, కాకతీయ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సందర్శించి పోలింగ్ సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మెదక్ – నిజామాబాద్ – కరీంనగర్ – ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 166 ఓట్లు ఉండగా 103 మంది తమ ఓటు హక్కు సద్వినియోగం(62.05 శాతం) చేసుకున్నారు. మెదక్ – నిజామాబాద్ – కరీంనగర్ – ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 4,585 మంది ఓటర్లు ఉండగా 1,780 మంది ఓటు హక్కు (38.82 శాతం) వినియోగించుకున్నారు. కాగా, హనుమకొండ కేడీసీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం అభ్యర్థులు సరోత్తంరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్, పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పూల రవీందర్ పోలింగ్ సరళిని పరిశీలించారు. మార్చి 3వ తేదీన లెక్కింపు జరుగనుంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన వరంగల్ సీపీ, ఆర్డీవోలు..

ఎల్కతుర్తి/హసన్‌పర్తి/పరకాల/వేలేరు : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు. ఎల్కతుర్తి, హసన్‌పర్తిలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. అలాగే పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను ఆర్డీవో నారాయణ పరిశీలించారు. వేలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో పోలింగ్ సరళిని ఆర్డీవో రమేశ్ రాథోడ్ పరిశీలించారు.

2188 ఓట్లకు రెండే పోలింగ్ కేంద్రాలు..

- ఇబ్బంది పడ్డ పట్టభద్రులు
- ఓటు వేయకుండానే తిరిగి వెళ్లిన వైనం

కమలాపూర్, ఫిబ్రవరి 27: కమలాపూర్‌లో మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 2188 ఓట్లకు రెండే కేంద్రాలు ఏర్పాటు చేయడంతో గ్రాడ్యుయేట్లు ఇబ్బంది పడ్డారు. దీంతో ఓటు వేసేందుకు భారీగా తరలిరావడంతో లైన్ పెరిగింది. చాలామంది పట్టభద్రులు లైన్‌ను చూసి ఓటు వేయకుండానే వెనుతిరిగారు. సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగిసే వరకు 200లకు పైగా ఓటర్లు లైన్‌లో ఉన్నారు. పట్టభద్రుల 2188 ఓట్లు కాగా 1603 మంది ఓట్లు వేయగా 73 శాతం పోలింగ్ అయింది.

ఎల్కతుర్తి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

వేలేరు : పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్

కమలాపూర్ : బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు

దాస్యం వినయ్ భాస్కర్‌ను కలిసిన దర్గా ప్రతినిధులు

సందల్ ఉత్సవాలకు దాస్యంకు ఆహ్వానం

హనుమకొండ, ఫిబ్రవరి 27 : నేడు నిర్వహించే వడ్డేపల్లి మదార్ సాహెబ్ దర్గా సందల్ ఉత్సవాల ఊరేగింపు కార్యక్రమానికి రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్‌ను దర్గా ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు. గురువారం వడ్డేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి సందల్ ఉత్సవాల ఊరేగింపుకు రావాలని కోరారు. ఆహ్వానించిన వారులో అబిద్ హుస్సేన్, అక్మల్, అక్తర్ హుస్సేన్, యాకూబ్ పాషా, మోయిన్ ఉన్నారు.

రోడ్డుపై రోడ్డు వేస్తున్న బల్దియా అధికారులు

బాగున్న రోడ్డుపైనే మళ్లీ రోడ్డు

- స్మార్ట్ సిటీ నిధులతో నిర్మాణం
- గతంలోనే ప్రతిపాదించామంటున్న బల్దియా అధికారులు

గుంతలు లేకుండా చక్కగా ఉన్న రోడ్డు

హనుమకొండ, ఫిబ్రవరి 27 : ఒక వైపు నగరంలోని కొన్ని కాలనీలు, ఏరియాల్లో రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బల్దియా ఇంజినీరింగ్ అధికారులు మాత్రం బాగున్న రోడ్డుపైనే మళ్లీ రోడ్డు వేస్తున్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో బల్దియా కాలనీల్లో రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, జంక్షన్లు అభివృద్ధి చేస్తున్నది. తాజాగా బాలసముద్రం ప్రాంతంలోని చిల్డ్రన్స్ పార్కు పక్కనున్న రోడ్డు సక్రమంగా ఉన్నప్పటికీ అదే రోడ్డుపై సీసీ రోడ్డు వేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కమీషన్లు దండుకొనేందుకే ఇలాంటి పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా గతంలోనే ప్రతిపాదించినట్లు బల్దియా అధికారులు అంటున్నారు. అలాగే ఒకవైపు డ్యామేజీ ఉందని అందుకే వేస్తున్నామని తెలిపారు. కాగా రోడ్డుపై రోడ్డు వేస్తున్న విషయంపై బల్దియా ఈఈ సంతోష్‌బాబును ఫోన్‌లో సంప్రదించగా, తాను బుధవారం వరకు సెలవులో ఉన్నానని, రోడ్డు సరిగా ఉంటే వేయరని, గతంలో ఒక వైపు రోడ్డు డ్యామేజీ అయిందని అందుకే వేస్తున్నామని, ఎక్కడ వేస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు.

సంస్కృతీసంప్రదాయాలు తెలుసుకోవాలి

తెలంగాణ - కేరళ అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనంలో కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, ఫిబ్రవరి 27 : తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో భారత ప్రభుత్వ యువజన, క్రీడల శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ – కేరళ అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. యువత సమాజానికి విస్తృత సేవలు అందించాలని సూచించారు. కేరళ యువత ఫిబ్రవరి 27 నుంచి మార్చి 3వ తేదీ వరకు పల్లెలు, పట్టణాల్లోని చారిత్రక ప్రదేశాలను సందర్శించనున్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన వీరికి డ్రెస్, టోపీలతో కూడిన కిట్లను కలెక్టర్ అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కేయూను సందర్శించిన కేరళ విద్యార్థులు..

హనుమకొండ చౌరస్తా : నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5 రోజుల 'అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనం'లో భాగంగా కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన 27 మంది యువతీయువకులు కాకతీయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సులు, వసతులు, విద్యార్థులకు ఉన్న అవకాశాల గురించి తెలుసుకున్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంతో ముచ్చటించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, హాస్టల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత అకులపల్లి మధు పాల్గొన్నారు.

కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డితో కేరళ విద్యార్థులు

ప్రొఫెసర్ జనార్దన్‌రావుకు నివాళి

నయీంనగర్, ఫిబ్రవరి 28 : ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు 23వ వర్ధంతి సందర్భంగా కేయూ విశ్వవిద్యాలయ క్రాస్ రోడ్డులోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బుచ్చిబాబుతో పాటు పలువురు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనార్దన్‌రావు ట్రస్టు కార్యదర్శి భిక్షపతి నాయక్, సత్యం, ప్రకాశ్‌రావు, రాజేశ్, వినీల్, వీరస్వామి, జగదీశ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జనార్దన్‌రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బుచ్చిబాబు

చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, ఫిబ్రవరి 27 : చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్ఈసీ రోడ్డులోని తారా గార్డెన్‌లో చేనేత హస్తకళ హ్యాండ్లూమ్, హ్యాండ్‌క్రాఫ్ట్ ప్రదర్శన నిర్వహించారు. హస్తకళలు పురాతనమైనవని, విభిన్న రూపాల్లో సంప్రదాయాలను చాటే చేనేత హస్తకళలను అందరూ ఆదరించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, రాజమల్లారెడ్డి, రవిప్రసాద్, రఘుపాల్, పవన్ పాల్గొన్నారు.

కేయూ తెలుగు విభాగ ఇన్‌చార్జి పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా శంకరయ్య

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27 : కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఇన్‌చార్జి పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా ఒప్పంద అధ్యాపకుడు మంథని శంకరయ్యను నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగనున్నారు.

రెండు బైక్‌ల అపహరణ

జూబ్లీ మార్కెట్ సమీపంలో బైక్‌ను అపహరించుకు పోతున్న వ్యక్తులు

కాజీపేట, ఫిబ్రవరి 27 : కాజీపేటలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జూబ్లీ మార్కెట్‌లో నివాసముండే ఫొటోగ్రాఫర్ రైస్ తన ఆర్ఎక్స్ యమహా బైక్‌ను మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేశాడు. తెల్లవారే సరికి బైక్ కనిపించలేదు. అదే రోజు విష్ణుపురి ప్రాంతంలో ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేసే గౌని సాంబయ్య గౌడ్ తన ఇంటి ప్రహరీ ఎదుట స్కూటీ పార్క్ చేశాడు. తెల్లవారి సరికి స్కూటీ కనిపించక పోవడంతో అంతా వెదికారు. అపహరించుక పోయిన గుర్తు తెలియని వ్యక్తులు సోమిడిలోని ఓ కాలనీలోని రోడ్డు పక్కన ఆ స్కూటీని వదిలి వెళ్లారు. తెలిసిన వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో సాంబయ్య అక్కడికి వెళ్లి తన స్కూటీని ఇంటికి తీసుకెళ్లాడు. అదే రోజు సోమిడిలోని అదే ప్రాంతంలో జోమాటోలో పని చేసే శోభన్‌కుమార్‌కు చెందిన నూతన బైక్ అపహరణకు గురైంది. బాధితులు తమ బైక్‌లు అపహరణకు గురైనట్లు కాజీపేట పోలీస్ స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేశారు. కాజీపేటలో బైక్‌ల దొంగతనం జరిగిన విషయం అందరికీ తెలియడంతో స్థానికులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను సామాజిక మాధ్యమాల్లో పెట్టగా, వైరల్ అయ్యాయి. పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు సమాచారం.

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27 : హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత పుస్తకాలు అందజేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికలో భాగంగా రాష్ట్రం నుంచి కేంద్ర జ్యూరీ వరకు ఎంపికైనందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వారు 'నేషనల్ బుక్ ట్రస్ట్'లో శాశ్వత సభ్యత్వాన్ని కల్పిస్తూ రూ.10 వేల విలువైన పుస్తకాలు సుమలతకు పంపారు. ప్రవేశపరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు ఉపయోగపడే ఈ పుస్తకాలను గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్‌కు ఆమె అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబమూర్తి పాల్గొన్నారు.

నల్లమారెమ్మ వాగు హద్దుల ఏర్పాటుకు సర్వే

ఐనవోలు, ఫిబ్రవరి 27 : పంథిని నల్లమారెమ్మ వాగు హద్దుల ఏర్పాటు కోసం గురువారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. పంథిని గ్రామ శివారులోని నల్లమారెమ్మ వాగు ఒడ్డును ఆనుకొని ఎటువంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టగా రైతులు, గ్రామస్తుల నడుమ కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నది. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పలుమార్లు సర్వే చేశారు. కానీ హద్దుల ఏర్పాటుపై క్లారిటీ రాలేదు. ఇరిగేషన్ ఈఈ నల్లమారెమ్మ వాగుకు హద్దులు ఏర్పాటు చేయాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీకి లెటర్ రాయగా, గురువారం సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఆర్ఐ రాణి, సర్వేయర్ సూరజ్ కుమార్‌తో కలిసి సర్వే చేసి హద్దులు గుర్తించినట్లు తెలిపారు. సర్వే కొనసాగుతుందన్నారు. సర్వేలో ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఐనవోలు : రథోత్సవంలో పాల్గొన్న ఈవో నాగేశ్వర్‌రావు, అర్చకులు, భక్తులు

కనుల పండువగా మల్లికార్జునుడి రథోత్సవం

ఐనవోలు, ఫిబ్రవరి 27 : ఐనవోలు మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవి రథోత్సవం గురువారం కనుల పండువగా సాగింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుద్రేశ్వరస్వామికి నాగవెల్లి సదస్యం..

హనుమకొండ చౌరస్తా : చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో రుద్రేశ్వరీ–రుద్రేశ్వర స్వామివార్లకు నాగవెల్లి సదస్యం నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను భరత్‌శర్మ, ఆదిత్యశర్మ, అచలాపూర్‌వేద పాఠశాల విద్యార్థులు, అవధాని గంగు మణికంఠశర్మ, గంగు ఉపేందర్‌శర్మ నిర్వర్తించగా, కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం 51 కిలోల పెరుగన్నంతో పూజ చేయనున్నట్లు ఈవో అనిల్‌కుమార్ తెలిపారు.

స్వాతంత్ర్యోద్యమంలో చంద్రశేఖర్ ఆజాద్‌ది కీలకపాత్ర


చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హనుమకొండ, ఫిబ్రవరి 27 : భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చంద్రశేఖర్ ఆజాద్ కీలకపాత్ర పోషించారని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి జరిగింది. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి విముక్తి కావాలని ఆజాద్ పోరాడారన్నారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లాంటి అనేకమంది విప్లవకారులను సమీకరించి స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణత్యాగం చేసిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ భారత చరిత్రలో వేగుచుక్కగా నిలిచారన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, నాయకులు మునగాల భిక్షపతి, నేదునూరి రాజమౌళి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

PASSPORT MISSING

I, Mohammed Anwer S/o Late Yakub Ali, R/o H.No. 2-9-1232, Waddepally, Hanumakonda Dist. I lost my Passport. Passport No. H0389081 While Travelling by Bike from Waddepally to Subedari. So if found Please let me know Contact Cell: 7330516331.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పెయింటర్లు

'ఆకలి కేక' పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ, ఫిబ్రవరి 27 : ఉమ్మడి వరంగల్ జిల్లా పెయింటింగ్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజారపు రాజు సమక్షంలో స్థానిక పెయింటర్లు 'ఆకలి కేక' పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికుల వల్ల స్థానిక పెయింటర్లకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో ఉన్న ఇంజినీర్లు, బిల్డర్లు, మేస్త్రీలు, పెయింట్ షాపు యజమానులు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, ఎండీ షబ్బీర్, గబ్బెట ఎల్లేశ్, ఇనుగాల సంతోష్, కొండా శ్రీకాంత్, బస్కు రాజు, రాహుల్, సంగాల హరీశ్, జన్ను సాంబయ్య పాల్గొన్నారు.

సొసైటీని సందర్శించిన నాబార్డు అధికారులు

ఐనవోలు, ఫిబ్రవరి 27 : నందనం సొసైటీని నాబార్డు అధికారులు గురువారం సందర్శించారు. నాబార్డు ముంబాయి హెడ్ ఆఫీసు జీఎం రమేశ్, తెలంగాణ రీజినల్ ఆఫీసర్ కమేశ్వర్‌రావు సొసైటీ లావాదేవీలను పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. సొసైటీ బిజినెస్, రుణాలు, డిపాజిట్ సేకరణపై అడిగి తెలుసుకున్నారు. సొసైటీ ఫంక్షన్ హాల్, మండల కేంద్రంలోని రూరల్ మార్ట్‌ను సందర్శించారు. వడ్లకు ఎండబెట్టడానికి సొసైటీకి డ్రయ్యర్, గ్యాస్ ఏజెన్సీ, సోలార్ ప్లాంట్లు కేటాయిస్తామని, వాటికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వారి వెంట డీడీఎం చంద్రశేఖర్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, ఐనవోలు డీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రావణ్, అసిస్టెంట్ మేనేజర్ గణేశ్, సీఈవో కోతి సంపత్ ఉన్నారు.


ఐనవోలులోని సొసైటీ రూరల్ మార్ట్‌లో నాబార్డు అధికారులు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- మడికొండ సాంఘిక సంక్షేమ గురుకులంలో హాస్టల్ నిద్ర

మడికొండ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల వివరాలు తెలుసుకుంటున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

మడికొండ, ఫిబ్రవరి 27 : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం రాత్రి ఆమె హాస్టల్ నిద్రలో భాగంగా సందర్శించి రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్, రికార్డులు పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఒత్తిడి లేకుండా చదవాలని, వెనుకంజలో ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, ఇతర వసతులను పరిశీలించారు. తరగతి గదులు, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. అలాగే విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేశారు. అనంతరం హాస్టల్లో విద్యార్థినులు, ఉప కమిషనర్ ప్రసన్నరాణి, వైస్ ప్రిన్సిపాల్ మాలికతో కలిసి కమిషనర్ నిద్రించారు.

పట్టుదల ఉంటే లక్ష్యం సాధించొచ్చు

కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27 : అంకిత భావం, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించొచ్చని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ సెనేట్ హాల్‌లో 'ఎక్స్‌ప్లోరింగ్ ఎడ్యుకేషనల్ అపర్చునూటీస్ ఇన్ ది యూఎస్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విశ్వవిద్యాలయంలో అకాడమిక్‌తో పాటు పూర్తిస్థాయి నైపుణ్యాల పెంపు దిశగా పనిచేస్తామన్నారు. హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ.. అమెరికాలో 4 వేలకుపైగా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. కేయూ పూర్వ విద్యార్థి, అమెరికా వ్యాపారవేత్త పులి రవి మాట్లాడుతూ.. ఎంతోమంది భారతీయులు అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్నారని, కష్టపడే మనస్తత్వం, టాలెంట్‌తో ముందుకు పోవచ్చన్నారు. రిజిస్ట్రార్ రామచంద్రం, ఓఎస్డీ మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు రమ, చిర్రా రాజు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాళ్లు రమణ, భిక్షాలు, బయోటెక్నాలజీ విభాగాధిపతి శాస్త్రి పాల్గొన్నారు.

స్వామి వారికి పూజలు చేస్తున్న శివనాగేంద్ర సరస్వతీ

మెట్టుగుట్టను దర్శించుకున్న ఆచార్య గౌడపాద కాశీ పీఠాధీశ్వర్

మడికొండ, ఫిబ్రవరి 27 : మడికొండ మెట్టుగుట్టను ఆచార్య గౌడపాద కాశీ పీఠాధీశ్వర్ శివనాగేంద్ర సరస్వతీ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వయంభూ లింగేశ్వరస్వామి, సీతారామచంద్ర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రాశస్త్యం గురించి ఆయనకు నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషుభారతి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.